నేను నాన్ననీ..

అమ్మ నవమాసాలు మోసి జన్మనిస్తే నాన్న అన్నీ తానై ముందుకు నడిపిస్తాడు. బిడ్డ భూమి మీదకు వచ్చింది మొదలు బాధ్యతగా కనిపెట్టుకుంటాడు. నాన్న అంటే ఓ ధైర్యం.. ఓ స్ఫూర్తి.. మనమెక్కే ప్రతి మెట్టు కింద ఆయన ఉంటాడు. అందుకే అమ్మకు, బ్రహ్మకు మధ్యన నిచ్చెన నాన్నే అంటారు. పిల్లల పెంపకంలో తల్లిని తలపిస్తూ.. కుటుంబం కోసం తన జీవితాన్ని ధారపోస్తున్న తండ్రులకు నేడు ఫాదర్స్ డే శుభాకాంక్షలు.. (విజయవాడలో ఓ రోడ్డుపై మండుటెండలో తన బిడ్డతో కలిసి పూల వ్యాపారం చేస్తున్న ఓ తండ్రి)



వేట మొదలు

సముద్రంలో ముగిసిన చేపల వేట నిషేధం

- నేటి నుంచి సముద్రంలోకి పడవలు
- నిషేధ భృతి ఇచ్చి మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



లంగరు వేసిన పడవలు

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపల వేట నిషేధ సమయం ముగిసింది. మత్స్యకారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో 110 కిలోమీటర్ల తీరం వెంబడి మచిలీపట్నం, కృత్తివెన్ను, కోడూరు, నాగాయలంక మండలాల్లోని 64 మత్స్యకారుల గ్రామాల్లో దాదాపు 2 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారు. వారిలో సముద్రంలో వేటకు వెళ్లేవారు దాదాపు 20 వేల మంది ఉన్నారు. వీరిలో అర్హులకు ప్రభుత్వం భృతి కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వం 12,151 మందికి రూ.10 వేల చొప్పున భృతి కల్పించగా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 13,077 మందికి రూ.20 వేల చొప్పున రూ.26 కోట్ల వరకు అందించింది. కాగా, వేట నిషేధ సమయంలో జిల్లాలో 2,268 పడవలు ఒడ్డునే ఉండిపోయాయి. ఏప్రిల్ 15 నుంచి శనివారం వరకు 61 రోజుల పాటు ఇవన్నీ వేటకు వెళ్లలేదు. ఈ 61 రోజులు మత్స్యకారులు వలలు అల్లుకుంటూ, పడవలకు మరమ్మతులు చేసుకుంటూ జీవించారు. కొందరు ఎండు చేపలు అమ్ముకున్నారు.

బదిలీల బంతాట..!

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో జరిగిన బదిలీల్లో గందరగోళం ఏర్పడింది. కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు నిర్వహించినా, ఆ తరువాత జరిగిన పరిణామాల్లో ఉద్యోగులు కోరుకున్న మండలాలకు పోస్టింగ్ ఇవ్వకపోవడం, ఇంతవరకు జాబితాలను విడుదల చేయకపోవడంతో గందరగోళం ఏర్పడింది.

డీఆర్‌డీఏలో బదిలీలు జరిగినా జాబితాలు బయట పెట్టరు

ఉత్తర్వులు ఉద్యోగుల వాట్సాప్‌కు పంపుతామంటూ గందరగోళం

- చక్రం తిప్పుతున్న ఓ అధికారి.. ఆందోళనలో ఉద్యోగులు
- ఆ నాలుగు మండలాల్లో ఏపీఎం పోస్టులు ఖాళీ
- మచిలీపట్నం మండల ఏపీఎం పోస్టుపై అనుమానాలు
- అధికారుల అక్రమాలను బయట పెడతానంటూ ఓ సీసీ హడావిడి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ముగ్గురు జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు మిగులుబాటుగా ఉండటంతో ఇటీవల వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఒక అధికారి బదిలీల అంశాన్ని తన చెప్పుచేతల్లోకి తీసుకుని తెరవెనుక కథ నడిపారని ఉద్యోగులు చెబుతున్నారు. కార్యాలయంలో ఈ అధికారి బాధ్యతలు వేరే ఉండగా, ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) దగ్గరే ఉంటూ అన్ని కార్యాలు చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఏయే మండలాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయో కూడా పూర్తి వివరాలు ఉద్యోగులకు తెలియజేయకుండా గోప్యత పాటించారనే విమర్శలు వస్తున్నాయి. కౌన్సెలింగ్ సమయంలో సెర్ప్ కార్యాలయం నుంచి ప్రత్యేక అధికారి వచ్చారని, ఆయన సమక్షంలోనే బదిలీలకు సంబంధించిన మండలాలను కోరుకున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. అప్పట్లో తాము కోరుకున్న మండలాలకే బదిలీ చేస్తామని ప్రకటించారని, జాబితా మాత్రం ఇంతవరకు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమని అడిగితే బదిలీ ఉత్తర్వులు వాట్సాప్‌కు వస్తాయని, దాని ప్రకారం విధుల్లో చేరాలని చెబుతున్నారని అంటున్నారు.

అధికారులను సీసీ బెదిరిస్తున్నారా?

మచిలీపట్నం మండల ఏపీఎం పోస్టు కోసం ఒక సీసీ ప్రయత్నాలు చేయడం, ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారడం వివాదాస్పదమవుతోంది. డీఆర్‌డీఏ కార్యాలయ అధికారులు తనకు ఏపీఎం పోస్టు ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా వేరే మండలానికి బదిలీ చేయడంతో ఆగ్రహంతో ఉన్న సదరు సీసీ.. అధికారులు చేసిన అక్రమాలు, ఇతరత్రా వ్యవహారాలు తన గుప్పెట్లో ఉన్నాయని, వాటిని బయట పెడతానని హెచ్చరిస్తుండటంతో ఇది చర్చనీయాంశంగా మారింది. ఓ ప్రజాప్రతినిధి పీఏ అండదండలున్న ఈ సీసీ అధికారుల వ్యవహారాలన్నీ వెల్లడిస్తానని చెబుతుండటంతో డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏం జరుగుతుందనే సందిగ్ధం నెలకొంది.



మచిలీపట్నంలోని డీఆర్‌డీఏ కార్యాలయం

నాలుగు మండలాల్లో ఏపీఎం పోస్టులు ఖాళీ

ఇటీవల జరిగిన బదిలీల్లో మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక, ఘంటసాల మండలాల్లో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం) పోస్టుల్లో ఎవరినీ నియమించలేదు. మచిలీపట్నం మండలంలో రెండేళ్లుగా ఈ పోస్టులో ఇన్‌చార్జే కొనసాగుతున్నారు. ఏపీఎంగా ఎవ్వరొచ్చినా ఇక్కడి మండల సమాఖ్యలో, వెలుగు కార్యాలయంలో పనిచేసే కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు (సీసీ) పెట్టే ఒత్తిడి తట్టుకోలేక వెళ్లిపోతున్నారు. మచిలీపట్నం మండలంలో 2వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. మత్స్యకారులకు పథకాలు అమలుచేసే విష యంలో, రుణాలు ఇచ్చే అంశంలో పైలెట్ ప్రాజెక్టుగా మిగతా 6లో..

కలిసికట్టుగా..

నిడమానూరు-రామవరప్పాడు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

- నిడమానూరు-మహానాడు 4 వరసల ఫ్లైఓవర్
- సంయుక్త డీపీఆర్‌కు ఎన్‌హెచ్, మెట్రో శ్రీకారం

మొత్తంగా రూ.150 కోట్లు ఆదా



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 16వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంయుక్త డీపీఆర్ తయారుకానుంది. ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) రూ.600 కోట్లతో 7 కిలోమీటర్ల మేర నిర్మించే నాలుగు వరసల సింగిల్ ఫ్లై ఓవర్‌కు, మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు 4.7 కిలోమీటర్ల మేర రూ.500 కోట్లతో నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు డీపీఆర్‌లను వేర్వేరుగా తయారు చేశాయి. కానీ, ఫ్లై ఓవర్, మెట్రో ఎలివేటెడ్ కారిడార్స్ రెండూ వేర్వేరుగా ఎన్‌హెచ్ అభివృద్ధి చేయటం సాధ్యం కాదు కాబట్టి మెట్రో కారిడార్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. ఎన్‌హెచ్, ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) మధ్య కుదిరిన ఏకాభిప్రాయం మేరకు డబుల్ డెక్కర్ ప్రతిపాదనకు అంగీకరించారు. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా ఏపీఎంఆర్‌సీ నుంచి కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్)కు ప్రతిపాదనలు అందాయి. ప్రస్తుతం ఈ అంశం మోర్త్ దగ్గర పెండింగ్‌లో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి గడ్కరీ మధ్య ఈ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినా మోర్త్ నుంచి అధికారికంగా అనుమతులు రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వటంతో ఇక ఆలస్యం కాకుండా ఉండేందుకు కంబైన్డ్ డీపీఆర్ తయారు చేయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఏపీఎంఆర్‌సీ అధికారులే కంబైన్డ్ మిగతా 6లో..

బహుళ ప్రయోజనమే..

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ వల్ల ఎన్‌హెచ్, మెట్రో అధికారులకు వ్యయం తగ్గుతుంది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు 7 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ నిర్మించాలనుకున్న 4 వరసల ఫ్లై ఓవర్‌కు రూ.600 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అదే మెట్రో కారిడార్‌తో సంయుక్తంగా చేపట్టడం వల్ల ఎన్‌హెచ్‌కు రూ.100 కోట్ల మేర ఆదా అవుతుంది. అలాగే, నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు మెట్రో రైల్ కార్పొరేషన్ నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు కూడా ఖర్చు తగ్గుతుంది. రూ.500 కోట్లు అంచనా వ్యయం కాగా, రూ.50 కోట్ల మేర తగ్గుతుంది.

నీట్‌లో మెరిశారు

గుడివాడకు చెందిన వి.పృథ్వీరాజ్‌కు ఆలిండియా 3508 ర్యాంకు

- ఓబీసీ కేటగిరీలోనూ 1291 ర్యాంకు సాధించి రికార్డు
- ఉమ్మడి కృష్ణాలో ఓపెన్ కేటగిరీలో వెయ్యిలోపు 40 జాతీయ ర్యాంకులు
- వీరంతా విజయవాడలో చదువుతున్న ఇతర జిల్లాల విద్యార్థులే..
- మెడిసిన్ చదివి పేదలకు సేవ చేస్తామంటున్న ర్యాంకర్లు 6



ఆలిండియా 3508 ర్యాంకు సాధించిన పృథ్వీరాజ్

ఒడిశా రైతులతో గంజాయి స్నేహం

డిబ్రీగూడ టూ బెంగళూరు వయా బెజవాడ

- ఐదారేళ్లుగా యథేచ్ఛగా గంజాయి వ్యాపారం
- బయటకు వస్తున్న బిక్కి నరేంద్ర లీలలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముసుగులో జరుగుతున్న గంజాయి వ్యాపారం కేసులో అనేక చీకటి కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఐదుగురు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేయగా, పెనమలూరు మండలం కానూరు నారాయణపురం కాలనీకి చెందిన బిక్కి నరేంద్ర వ్యవహారాలు బయట పడుతున్నాయి. ఒడిశాలోని డిబ్రీగూడ నుంచి బెంగళూరుకు గంజాయి సరఫరా చేస్తున్న నరేంద్ర ఐదారేళ్ల నుంచి ఈ వ్యవహారాలు నడుపుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. గంజాయి కొనుగోలుకు మధ్యవర్తులతో కాకుండా నేరుగా రైతులతోనే సత్సంబంధాలు పెట్టుకుని వ్యాపారంలో కిక్కును పొందుతున్నాడు. నరేంద్ర కొంటున్న గంజాయి మొత్తం ఒడిశాలోని డిబ్రీగూడలో పండించిందేనని పోలీసులు గుర్తించారు.

మైనర్‌ను తీసుకొచ్చి ఉపాధి

టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన ఐదుగురిలో ఒక మైనర్ ఉన్నాడు. సరుకు కొనుగోలు నిమిత్తం నరేంద్ర ఒడిశాకు వెళ్లినప్పుడు ఆ మైనర్‌ను గుర్తించి సహాయకుడిగా తెచ్చుకున్నాడు. నరేంద్ర తన గ్యాంగ్‌తో మిగతా 6లో..



తోట్లవల్లూరు ఆర్అండ్‌బీ రోడ్డులో ఎదురెదురుగా వచ్చి ఇరుక్కుపోయిన రెండు ఇసుక లారీలు

చక్రబంధం

తోట్లవల్లూరు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య

ఇరుకుగా ఆలయాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు

- రోడ్డును విస్తరించలేకపోవడంతో ఇబ్బందులు
- రెండు లారీలు ఎదురైతే నరకయాతనే..
- చెరకు ట్రాక్టర్ వస్తే తప్పుకోవటం కష్టమే..
- బైపాస్ నిర్మించాలని కోరుతున్న స్థానికులు

తోట్లవల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ట్రాఫిక్ సమస్యలు తారస్థాయికి చేరాయి. ఓవైపు గ్రామంలో జనాభా 10 వేల మార్కు చేరుకోవటం, మరోవైపు కరకట్ట వెంబడి అనేక గ్రామాల నుంచి ఇసుక లారీలు తోట్లవల్లూరు మీదుగా ఉయ్యూరుకు, ఉయ్యూరు నుంచి తోట్లవల్లూరు వైపునకు రావటంతో ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ రద్దీకి తగ్గట్టుగా స్థానిక ఆలయాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డును విస్తరించే అవకాశం లేకపోవటంతో ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డు నిర్మాణమే పరిష్కారమని స్థానికులు అంటున్నారు.

సింగిల్ రోడ్డుతో సమస్యలెన్నో..

పూర్వం జమిందార్ల ఏలుబడిలో తోట్లవల్లూరు హైస్కూల్ నుంచి తేలప్రోలు వరకు విశాలమైన ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మించారు. అయితే, కరకట్ట నుంచి సెంటర్ వరకు సుమారు అర కిలోమీటర్ వరకూ ఆర్అండ్‌బీ రోడ్డు శ్రీవేణు గోపాలస్వామి, శ్రీమద్‌భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయాల మధ్య ఉంది. ఇది సింగిల్ రోడ్డుగా ఉంది. అభివృద్ధి చేయటానికి వీల్లేకుండా మిగిలిపోయింది. ఈ ఆలయాల మధ్య రోడ్డు విస్తరించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో నిత్యం కరకట్ట నుంచి సెంటర్ వరకు ఉన్న రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుని గతంలో రాధ అనే ఓ రైతు, డేవిడ్ అనే రైల్వే ఉద్యోగి మృతిచెందారు. తోట్లవల్లూరు రోడ్డులో నిత్యం వందల ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒకేసారి రెండు లారీలు ఎదురుపడితే అవి తప్పుకోవటానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. చెరుకు లోడుతో ట్రాక్టర్ వస్తే సైకిల్ కూడా తప్పుకొనే అవకాశం లేదు. దీంతో ఒక్కోసారి వాహనాల డ్రైవర్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండగా, ఉత్తరం వైపున సాయిబాబా గుడి వైపు ఉన్న అంతర్గత రోడ్డు నుంచి బస్సులు, లారీలు, ఇతర వాహనాలు మిగతా 6లో..



చెరకు ట్రాక్టర్ వస్తే సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి

బైపాస్ ఎక్కడ నిర్మించాలంటే..

తోట్లవల్లూరు శివారు కలాస్‌మాలపల్లి (అంబేడ్కర్ నగర్) మధ్య పొలాల మీదుగా కనకదుర్గమ్మ కాలనీ వరకు సుమారు ఒక కిలోమీటర్ వరకు బైపాస్ రోడ్డు నిర్మించవచ్చు. దీనిని ఉయ్యూరు వెళ్లే మెయిన్ రోడ్డుకు కలపొచ్చు. ప్రభుత్వం రైతుల నుంచి భూములను కొని బైపాస్ రోడ్డు నిర్మిస్తే తోట్లవల్లూరులో ట్రాఫిక్ సమస్యలు తీరే అవకాశముంది.



లీలాసాయి, హిరణ్య అంత్యక్రియలు పూర్తి 6

- ఇంకా లభించని రవిశంకర్ ఆచూకీ
- కన్నీరుమున్నీరవుతున్న తల్లి చంద్రిక

ఆర్అండ్‌బీ రోడ్లకు టెండర్లు 6

- ఉమ్మడి కృష్ణాలో రూ.13.18 కోట్లతో ఆరు రోడ్ల అభివృద్ధికి శ్రీకారం

దుర్గగుడికి కారు, దుర్గమ్మకు బంగారు హారం

- కానుకగా అందజేసిన వరంగల్ భక్తులు

డీఎస్సీ పరీక్షల తేదీల్లో మార్పు

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20, 21న జరగాల్సిన డీఎస్సీ పరీక్షలను జూలై 1, 2న నిర్వహించనున్నట్టు డీఈవో పీవీజే రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు. కాగా, శనివారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో 719 మందికి 611 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 108 మంది గైర్హాజరయ్యారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నూతన కౌన్సిల్ ఏర్పాటు

విజయవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడానికి 8 మంది విద్యావేత్తలతో కూడిన నిపుణులను ప్రభుత్వం నామినేట్ చేసింది. శనివారం సీఎం చంద్రబాబు అధికారికంగా ఈ కౌన్సిల్‌ను ఆమోదించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుబ్బారావు, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీకి చెందిన ఎనస్తీషియా మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం విష్ణు మహేష్ బాబు, తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి గైనకాలజీ ప్రొఫెసర్ కే మాధవి, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీకి చెందిన ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ సూరపనేని సురేష్‌బాబు, విజయనగరానికి చెందిన మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి రేడియాలజీ ప్రొఫెసర్ ఎం.జైచంద్రనాయుడు, ఆమదాలవలస ప్రభుత్వాసుపత్రికి చెందిన శిశువైద్యుడు డాక్టర్ చాపర సుధాకర్, ప్రొద్దుటూరు నుంచి (జనరల్ మెడిసిన్) ఎండీ డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్ రెడ్డి, విజయవాడ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వై.సాయి కిషోర్‌ను ఈ కౌన్సిల్‌లో సభ్యులు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు ప్రభుత్వ నామినీలుగా కార్యనిర్వాహక మండలిలోని ఐదుగురిని ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమించారు. ఇందులో ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి, వైద్య విద్య డైరెక్టర్, కమిషనర్ (ఆయుష్ విభాగానికి), హెల్త్ డైరెక్టర్లను నియమించారు. వారి వివరాలు ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు.



దేవస్థానానికి కారు, అమ్మవారికి హారాన్ని విరాళంగా ఇస్తున్న దాత భూపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులు

దుర్గగుడికి కానుకగా కారు, కనకదుర్గ అమ్మవారికి బంగారు హారం

ఇంద్రకీలాద్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన కనకదుర్గమ్మ భక్తుడు జి.భూపాల్ రెడ్డి శనివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి కుటుంబం సహా వచ్చారు. ఈ సందర్భంగా తాము గతంలో అమ్మవారికి మొక్కుకున్న మేరకు దేవస్థానానికి కారు, దుర్గమ్మకు హారాన్ని కానుకగా ఇచ్చారు. రూ.4.75 లక్షల విలువైన రినాల్ట్ క్విడ్ కారు, రాళ్లు, ముత్యాలు పొదిగిన 21 గ్రాముల బరువున్న బంగారు నెక్లెస్‌ను కానుకగా ఈవో శీనానాయక్ ద్వారా అందజేశారు. అనంతరం జి.భూపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వారికి అర్చకులు వేదమంత్ర ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

పురస్కారాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో శిష్యులకు శిక్షణ ఇస్తూ హితబోధనలు చేస్తున్న గురువుల ప్రతిభా పాటవాలను, సేవలను గుర్తించి వారికి గురుబ్రహ్మ, గురుశిరోమణి-2025 పురస్కారాలు ఇచ్చి సత్కరించి, ప్రోత్సహించేందుకు గురువులకు వందనం పేరుతో జూలై 10న పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (హైదరాబాద్) వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, యోగ, ఆధ్యాత్మిక, ధార్మిక, సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే వంటి వాటిలో నిష్ణాతులైన గురువులను సన్మానించేందుకు అర్హులైన వారి నుంచి పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. గురువుల ప్రతిభా విశేషాలు, సేవలు, శిక్షణ గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పేపర్ క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలు, 4 కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జత చేసి ఈనెల 20లోపు కార్యాలయానికి పంపాలన్నారు. వివరాలకు 96523 47207 నెంబరును సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- 'పెన్' నూతన జనరల్ సెక్రటరీ గరికపాటి



విజయవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) రాష్ట్ర నూతన జనరల్ సెక్రటరీ గరికపాటి వెంకట సాంబశివరావు (సాంబ) అన్నారు. పెన్ నూతన జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన అనంతరం శనివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో బాధ్యతలు స్వీకరించారు. పెన్ రాష్ట్ర కార్యదర్శి బద్దం సుమలత, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బడే ప్రభాకర్ పాల్గొనగా, రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సింహాద్రి కృష్ణ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా లేబాక నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్‌గా గడ్డిపాటి సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మంత్రి కొల్లు రవీంద్ర పీఏపై
పేర్ని నాని వ్యాఖ్యలు గర్హనీయం

- రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర వద్ద పీఏగా పనిచేస్తున్న టీ శివరామకృష్ణపై మాజీ మంత్రి పేర్ని నాని నిరాధారమైన ఆరోపణలతో పాటు వ్యక్తిగత దూషణలు చేయడం గర్హనీయమని కృష్ణాజిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, కార్యదర్శి ఎం శ్యామ్‌నాథ్‌గౌడ్ అన్నారు. శనివారం రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటారని, చట్టాలకు లోబడి నిబంధనల మేరకే నడుచుకుంటారన్నారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తారన్నారు. రాజకీయ నేతలు ఉద్యోగులపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని, పేర్ని నాని చేసిన విమర్శలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని వ్యాఖ్యలను జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పీ సత్యనారాయణ, మచిలీపట్నం డివిజన్ అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయకుమార్ ఖండించారు.

లీలాసాయి, హిరణ్య అంత్యక్రియలు పూర్తి



మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లి చంద్రిక

మైలవరం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 4 రోజుల క్రితం మైలవరం పట్టణం తిరువూరు రోడ్డులోని ప్రమీల అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న ఇంటిలో ఇద్దరు బాలల అనుమానాస్పద మృతి పట్టణంలో కలకలం రేపింది. బాలల తండ్రి వేములవాడ రవిశంకర్ రాసిన లేఖ ఆధారంగా తన ఇద్దరి పిల్లల్ని తానే చంపేసి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణయింది. పిల్లల్ని చంపి ఇంటికి తాళం వేయగా, చనిపోయి నాలుగైదు రోజులు కావడంతో మృతదేహాలకు పురుగులు పట్టి దుర్గంధం వచ్చింది. పోలీసులు పరిశీలన అనంతరం మృతదేహాలను మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా కంపోజ్ స్థితిలో ఉండటంతో మృతదేహాల పోస్టుమార్టం ఇక్కడ కుదరదని వైద్యులు చెప్పడంతో శుక్రవారం సాయంత్రం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాలకు మైలవరం పట్టణంలోని తిరువూరు వెళ్లే రోడ్డులోని హిందూ స్మశాన వాటిక వెనక సమీపంలో అంత్యక్రియలను తల్లి చంద్రిక, తాతయ్య, నానమ్మ, బంధువులు కలిసి చేశారు. రవిశంకర్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా, లేదా ఎటన్నా వెళ్లి ఉంటాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీట్‌లో మెరిశారు..!

- గుడివాడకు చెందిన పృథ్వీరాజ్‌కు ఆలిండియా 3,508వ ర్యాంకు
- ఓబీసీ కేటగిరీలో 1,291 ర్యాంకు.. తల్లిదండ్రులిద్దరూ వైద్యులే!
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,000 లోపు ఓపెన్ కేటగిరీలో 40 జాతీయ ర్యాంకులు
- విజయవాడలో చదువుకున్న ఇతర జిల్లాల విద్యార్థులకు భారీగా ర్యాంకులు
- 50-60 మార్కులు తగ్గటంతో మంచి ర్యాంకులు కోల్పోయామన్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ/కానూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో మన దగ్గర చదువుకున్న విద్యార్థులు మెరిశారు! వైద్య వృత్తి పట్ల ఇష్టంతో ఎంతో కష్టంతో తాము కన్న కలలను విద్యార్థులు సాకారం చేసుకున్నారు. నీట్‌లో జాతీయ ర్యాంకులు సాధించి వైద్యరంగంలోకి ప్రవేశించేందుకు బాటలు పరచుకున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఓపెన్ కేటగిరీలో వెయ్యిలోపు 40 మంది విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించారు. ఈసారి పేపర్ చాలా కష్టంగా రావటంతో 40-50 మార్కులు తగ్గాయని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలైన గోసలైట్స్, చైతన్య, నారాయణ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు! కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన వేల్పూరి పృథ్వీరాజ్ జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. ఆలిండియాలో 3508 ర్యాంక్ సాధించగా.. ఓబీసీ కేటగిరీలో 1291 ర్యాంకు లభించింది. పృథ్వీరాజ్ తల్లిదండ్రులు వృత్తిరీత్యా వైద్యులు.

ఆలిండియా ర్యాంకర్లు వీరే..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నారాయణ విద్యాసంస్థలకు చెందిన ముస్కాన్ ఆనంద్ 643 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 112వ ర్యాంక్ సాధించాడు. అభినవ 631 మార్కులతో 231వ ర్యాంక్, ఎం హస్వికారెడ్డి 625 మార్కులతో 343వ ర్యాంక్, అక్షయ్ కీర్తన్ 623 మార్కులతో 379వ ర్యాంక్, శ్రీరామ్ యాదవ్ 617 మార్కులతో 536వ ర్యాంక్, కే నికిత 615 మార్కులతో 646వ ర్యాంక్, యశశ్వినీ 614 మార్కులతో 646వ ర్యాంక్, భావనాసి ఇషాంత్ 614 మార్కులతో 657వ ర్యాంక్, కే సైనారెడ్డి 609 మార్కులతో 866వ ర్యాంక్, వై కృష్ణ ప్రణీత్ 608 మార్కులతో 900వ ర్యాంక్ సాధించినట్టు సంస్థ డీజీఎం రవిశంకర్ తెలిపారు. జాతీయ స్థాయిలో 5వేలలోపు 34మంది, 10 వేలలోపు 79 మంది ర్యాంకులు సాధించారు. మొత్తంగా 170కు పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధిస్తారన్నారు.

విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విజయవాడ క్యాంపస్ నుంచి ఆలిండియా అన్ని కేటగిరీల్లో 100 లోపు ర్యాంకులు ఆరుగురు సాధించారు. బీ ధీరజ్ 8వ ర్యాంకు, పి.అవినాష్ 15వ ర్యాంకు, టి.శివ మనదీప్ 24వ ర్యాంకు, పి.త్రివిక్రమ్ 57వ ర్యాంకు, బి.కుముద 61వ ర్యాంకు, కె.ప్రిన్స్ 98వ ర్యాంకు సాధించినట్టు ఆ సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ తెలిపారు. ఆలిండియా క్యాటగిరీలో ఐదుగురు 10లోపు ర్యాంకులు సాధించారని కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. వెయ్యిలోపు 1600 మందికి పైగా మెడికల్ సీట్స్ వచ్చినట్లు ప్రకటించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ అభినందించారు.

144వ ర్యాంక్ వస్తుందని ఊహించలేదు
ఎస్ ప్రజ్ఞేశ్వరరావు, హైదరాబాద్



నీట్‌లో ఆలిండియా క్యాటగిరిలో 144వ ర్యాంక్ వస్తుందని ఊహించలేదు. మంచి ర్యాంకే వస్తుందని భావించా. ఇంత మంచి ర్యాంక్ వస్తుందనుకోలేదు. శ్రీగోసలైట్స్‌లోనే కోచింగ్ తీసుకున్నా.

తల్లిదండ్రుల కృషి వల్లే బాగా చదివా
జీ సతీష్ చంద్ర రాయల్, కర్నూలు జిల్లా



తల్లిదండ్రుల కృషి, విజయవాడ శ్రీగోసలైట్స్ సంస్థ సహకారంతో నీట్ ఆలిండియా క్యాటగిరిలో 181వ ర్యాంక్ సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. తండ్రి వెంకట సుబ్బన్న రైతుగా పనిచేస్తూ పడుతున్న ఇబ్బందుల ను గుర్తుచేసుకుంటూ బాగా చదివి ర్యాంక్ సాధించాను.

ఎంతో సంతోషంగా ఉంది
డీజేజీ యువరాజ్, అమలపాడు, శ్రీకాకుళం జిల్లా



ఆలిండియా క్యాటగిరిలో 207 ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. డాక్టర్ కోర్సు పూర్తిచేసుకున్న తరువాత శాస్త్రవేత్తల వింగ్‌లోకి వెళ్లి వారికి వైద్యసేవలందిస్తాను. విజయవాడలో శిక్షణ బాగా ఇస్తారని తెలిసి కోచింగ్ తీసుకున్నా. ఫ్యాకల్టీ, తల్లిదండ్రుల ప్రోత్సహంతో ర్యాంక్ సాధించా

పేదలకు వైద్యసేవలు అందిస్తా
టీ హర్షిత్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా



నీట్‌లో ఎస్సీ క్యాటగిరిలో 22 ర్యాంక్, ఆలిండియా క్యాటగిరిలో 876 ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తాను మెడిసిన్ చదవాలని ప్రోత్సహించారు. శ్రీగోసలైట్స్ విద్యా సంస్థలోని ఫ్యాకల్టీ బాగా బోధన చేశారు.

కార్డియాలజీ లేకపోతే న్యూరాలజీ
సాయికిరణ్, 98వ ర్యాంకర్



నేను శ్రీ చైతన్యలో చదువుతూ అక్కడే నీట్ కోచింగ్ తీసుకున్నా. ఒక ప్లానింగ్ ప్రకారం చదవడం వల్లే ఇది సాధ్యమైంది. కార్డియాలజీలో కాని న్యూరాలజీలో కాని స్పెషలైజేషన్ చేయాలన్నది నా కోరిక. ఎయిమ్స్‌లో సీటు కష్టమనిస్తుంది. అయినా నా కోరికను నెరవేర్చుకుంటా.

ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలని కోరిక
తుమ్మరి శివ మన్‌దీప్



ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలని కోరిక. అందులో సీటు సంపాదించాలంటే కష్టపడాలని సీనియర్లు చెప్పేవారు. అందుకు తగ్గట్టు కష్టపడ్డాను. ఎంబీబీఎస్‌లో కార్డియాలజీ చేయాలన్నదే నా ఆశ. డాక్టర్‌గా మంచి సేవలందించాలని చిన్నప్పటి నుంచి కోరిక. కేటగిరీలో 57వ ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది.



డాక్టర్ అవ్వాలన్నది నా కల
వేల్చూరి పృథ్వీరాజ్, గుడివాడ

డాక్టర్ అవ్వాలన్నది నా కల! దీనికోసం ఎంతో కష్టపడ్డా. నా కష్టం వృథా పోలేదు. జాతీయ స్థాయి ర్యాంకు సాధించటం ఆనందంగా ఉంది. విజయవాడలోని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీలో చదివాను. కళాశాల ప్రోద్బలం, తల్లిదండ్రుల సహకారంతో ఈ ర్యాంక్‌ను సాధించాను. చిన్నప్పటి నుంచి డాక్టర్‌ను కావాలన్న కోరిక. డాక్టర్‌ను అయిన తరువాత పేద, మధ్య తరగతి వర్గాలకు సేవలు అందించాలన్నది నా ఆశయం. దీని కోసం ఎంబీబీఎస్‌కు కూడా ఇలాగే కష్టపడతా.

ఇంకా మంచి ర్యాంకు వస్తుందనుకున్నా- కుముద, 61వ ర్యాంకర్



కష్టపడి చదివా. ఇంకా మంచి ర్యాంకు వస్తుందని ఊహించా. నా ర్యాంకు పట్ల తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. మంచి వైద్యురాలిగా సేవలందించాలి. పలానా విభాగం అని ఏమీలేదు. డాక్టర్‌గా పేదలకి సేవలందించాలి. సివిల్స్‌లో కూడా రాణించాలని నా కోరిక.

412 ర్యాంకుతో శ్రీలక్ష్మి అత్యుత్తమ ప్రతిభ



నందిగామ: పట్టణానికి చెందిన కొల్లూరి శ్రీలక్ష్మి అనే విద్యార్థిని నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. శనివారం విడుదలైన ఫలితాల్లో శ్రీలక్ష్మి 412వ ర్యాంక్ సాధించారు. రైతు కుటుంబానికి చెందిన శ్రీలక్ష్మి ఈ ఘనత సాధించడంపై ఆమె తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, శైలజ సంతోషం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన పలువురు విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తాను సాధించిన విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శ్రీలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

నీట్‌లో శ్రీగోసలైట్స్‌కు ర్యాంకల పంట

నీట్-2025 ఫలితాల్లో విజయవాడలోని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమికి అధిక ర్యాంక్‌లు వచ్చాయి. ఈ సందర్భంగా శనివారం కానూరులో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరేంద్రబాబు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌లో సుమారు 1500 మందికిపైగా శ్రీగోసలైట్స్ విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రీ మెడికల్ సీట్లు సాధించే ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నారన్నారు. నీట్‌లో 720 మార్కులకు గాను 600కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 11మంది, 550పైన మార్కులు సాధించిన 69 మంది, 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 379 మంది ఉన్నారన్నారు. ఎస్సీ క్యాటగిరిలో టి.హర్షిత్ అనే విద్యార్థి 22వ ర్యాంక్, ఆలిండియా క్యాటగిరిలో పలువురు విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారన్నారు. 2026 నీట్‌లో మొదటి 10 ర్యాంక్‌లో తమ సంస్థ విద్యార్థులను నిలపాలనే దృఢసంకల్పంతో ఉన్నామని నరేంద్రబాబు చెప్పారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

- ఎమ్మెల్యే వసంత
- 130 మంది విద్యార్థులకు రూ.7.40 లక్షల సొంత నగదు అందజేత



విద్యార్థి హరిణికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మైలవరం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం కూడా ముఖ్యమని ఎమ్మెల్యే వసంత అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్, పదవ తరగతుల్లో విద్యనభ్యసించి నియోజకవర్గవ్యాప్తంగా తొలి మూడుస్థానాల్లో నిలిచిన షైనింగ్ స్టార్స్ విద్యార్థినీ, విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతుల పంపిణీని పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రాజకీయ ఘనత కోసం కాదన్నారు. బాగా చదువుకొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ప్రభుత్వ సౌకర్యాలతో పాటు తన అండదండలు ఉంటాయని భరోసా కల్పించారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన 130 మంది విద్యార్థులకు రూ.7.40లక్షల సొంత నిధులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు గ్రామానికి చెందిన కొప్పుల దుర్గా ప్రసాద్‌రెడ్డి అనే విద్యార్థి తనకు సైకిల్ లేకపోవడంతో పడిన ఇబ్బందులు చెబుతూ నవ్వులు పువ్వులు పూయించాడు. దీంతో ఎమ్మెల్యే అతడికి కార్యక్రమం ముగిసేలోగా సైకిల్ తెప్పించి అందజేశారు.

కృత్రిమ అవయవాలు, ఉపకరణాల అందజేత

నియోజకవర్గ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు 222 మందికి రూ.43.20 లక్షల విలువైన కృత్రిమ అవయవాలను, ఉపకరణాలను ఎమ్మెల్యే వసంత మైలవరం మార్కెట్ యార్డులో అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రెడ్డిగూడెం మండలంలో నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.3.73 లక్షలు, మైలవరం మండలంలో ఐదుగురికీ రూ.5.37 లక్షలు, జి.కొండూరు మండలంలో 10 మందికి రూ.4.90 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే వసంత ఆయా లబ్ధిదారులకు మార్కెట్ యార్డులో చెక్కులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ నవ్యశ్రీ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగుండ్ల ప్రసాద్, మైలవరం సర్పంచ్ మంజు భార్గవి, జంపాల సీతారామయ్య, ఉయ్యూరి నర్సింహారావు, ముప్పుడి నాగేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణాలో ఆర్ అండ్ బీ రోడ్లకు టెండర్లు

- రూ.13.18 కోట్ల వ్యయంతో ఆరు రోడ్ల అభివృద్ధికి శ్రీకారం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాలో రహదారులు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ఆధ్వర్యంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలిచారు. మొత్తం ఆరు రోడ్ల అభివృద్ధికి ఎండీఆర్ - నాబార్డు నిధులతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. మొత్తంగా రూ.13.18 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. ఎన్టీఆర్ జిల్లాలో అక్కపాలెం నుంచి తిరువూరు రోడ్డు అభివృద్ధికి రూ.2.25 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఎండీఆర్ - నాబార్డు నిధులతో ఈ రోడ్డును బాగు చేసేందుకు టెండర్లు పిలిచారు. జూన్ 20న టెండర్లను ఓపెన్ చేస్తారు. అలాగే చందర్లపాడు మండలంలో ముప్పాళ్ల నుంచి ఏటూరు రోడ్డు వరకు 14.50 కిలోమీటర్లు, అలాగే చందర్లపాడు నుంచి పెట్రంపాడు వరకు 3 కిలోమీటర్లు వరకు రూ.2కోట్లతో అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచారు. జూన్ 27న టెండర్లను ఓపెన్ చేస్తారు. కృష్ణాజిల్లాలో పోడు నుంచి చిన్నగొల్లపాలెం వరకు 14 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి టెండర్లు పిలిచారు. జూన్ 27న టెండర్లను ఓపెన్ చేస్తారు. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం డివిజన్ పరిధిలో రామాపురం గ్రామం దగ్గర హిందూ శ్మశాన వాటిక నుంచి రైస్‌మిల్, ఫోర్ రోడ్డు జంక్షన్ వరకు 3.30 కిలోమీటర్ల దూరాన రోడ్డును అభివృద్ధిపరిచేందుకు రూ.2.09 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. జూన్ 24న టెండర్లను ఖరారు చేయనున్నారు. తాళ్లపాలెం నుంచి నారాయణపురం రోడ్డు వరకు 14 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.1.98 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. జూన్ 20న టెండర్లు ఓపెన్ చేస్తారు. పునాదిపాడు - పెద పారుపూడి రోడ్డును రూ.1.66 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచారు. జూన్ 19న టెండర్లు తెరుస్తారు.

కలిసికట్టుగా..

(5వ పేజీ తరువాయి)

డీపీఆర్‌ను తయారు చేయించాలని నిర్ణయించారు. బాలాజీ రైల్ కంపెనీ లిమిటెడ్ అనే సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం కంబైన్డ్ డీపీఆర్‌కు రూపకల్పన జరుగుతోంది.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం ఏపీఎంఆర్‌సీదే..

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ మాత్రమే చేపట్టనుంది. తామే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మిస్తామని ఆ సంస్థ ప్రకటించింది. నాలుగు వరసల ఫ్లై ఓవర్‌పై మెట్రో ఎలివేటెడ్ కారిడార్ వస్తున్న నేపథ్యంలో భూగర్భ పిల్లర్లను ఆ స్థాయిలో నిర్మించాల్సి ఉంటుంది.

చక్రబంధం

(5వ పేజీ తరువాయి)

వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే, పాత పోస్టాఫీస్ రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వెనుకగా కూడా రాకపోకలు సాగిస్తున్నారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం జరిగితే విజయవాడకు తోట్లవల్లూరు మీదుగా వెళ్లే వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇన్ని సమస్యల నడుమ తోట్లవల్లూరు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం ఎంతో అవసరం అని స్థానికులు కోరుతున్నారు.

బైపాస్ నిర్మాణం ఎంతో అవసరం

తోట్లవల్లూరుకు బైపాస్ రోడ్డు నిర్మాణం ఎంతో అవసరం. దేవాలయాల మధ్య రోడ్డు భారీ వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేదు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన ప్రణాళిక సిద్ధంచేసి బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. - గుత్తా రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు

బదిలీల బంతాట..!

(5వ పేజీ తరువాయి)

మచిలీపట్నం మండలం ఉంది. ఈ మండల సమాఖ్యలో రూ.2.10 కోట్ల మేర నగదు ఉంది. ఈ నగదును ఎలాగైనా పక్కదారి పట్టించేందుకు కొంతకాలంగా కొందరు.. ఒక సీసీ ద్వారా తెరవెనుక వ్యూహం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ పనిచేసే సీసీకి విద్యార్హతలు లేకున్నా ఇన్‌చార్జి ఏపీఎంగా నియమిస్తూ ఐదారు నెలల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం తెలిసిన ఉన్నతాధికారులు డీఆర్‌డీఏ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆ సీసీని ఇన్‌చార్జి ఏపీఎం విధుల నుంచి పక్కనపెట్టారు. నగదు పక్కదారి పట్టకుండా అధికారులు ముకుతాడు వేస్తూ వస్తున్నారు. మచిలీపట్నం మండల సమాఖ్యలో వివాదాస్పదంగా ఉన్న సీసీని ప్రస్తుతం జరిగిన బదిలీల్లో పెడన మండలానికి బదిలీ చేశారు. మచిలీపట్నం మండల కార్యాలయంలో ఐదుగురు సీసీలు, ఒక ఏపీఎం ఉండాలి. చిన్న మండలాల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని ఉంచి, మచిలీపట్నం మండలంలో మాత్రం ఒక్క సీసీనే ఉంచి, మిగిలిన వారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇక్కడ ఏపీఎంతో పాటు సీసీలు లేరనే కారణం చూపి పెడనకు బదిలీ చేసిన సీసీని మళ్లీ మచిలీపట్నానికి తెచ్చేందుకు ఎత్తుగడ వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బదిలీలు పారదర్శకంగానే జరిగాయి

ఉమ్మడి జిల్లా పరిధిలో డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగానే జరిగాయి. మచిలీపట్నం మండలంతో పాటు మరో మూడు మండలాల్లో ఏపీఎంలుగా వచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. - హరిహరనాథ్, డీఆర్‌డీఏ పీడీ

ఒడిశా రైతులతో గంజాయి స్నేహం

(5వ పేజీ తరువాయి)

గంజాయి కొనుగోలుకు వెళ్లిన ప్రతిసారీ కొండలపై నుంచి ప్యాకెట్లను మోసుకుని బాలుడు కిందకు రావడాన్ని గమనించాడు. పైగా ఆ అబ్బాయి తెలుగు బాగా మాట్లాడుతుండటంతో కానూరుకు తీసుకురావాలని భావించాడు. కొనుగోలు చేసిన సరుకును సంబంధిత వ్యక్తులకు చేర్చడానికి ఈ మైనర్ బాగా ఉపయోగపడతాడని గుర్తించాడు. దీంతో ఆ బాలుడిని కానూరుకు తీసుకొచ్చి రూమ్‌ను అద్దెకు తీసుకుని ఉంచాడు. అవసరమైన అన్ని సదుపాయాలు నరేంద్రనే కల్పించాడు.

బైకులు, కార్లతో ఎస్కార్ట్

గంజాయి గ్యాంగ్ సాధారణంగా ఎస్కార్ట్ విధానాన్ని పాటిస్తుంది. వెనుకవైపు రెండు బైక్‌లపై గంజాయి తీసుకొస్తున్నారంటే ముందు మరో రెండు బైకులు ఆ మార్గంలో పరిస్థితులను గమనించడానికి వెళ్తుంటాయి. ఎక్కడెక్కడ పోలీసులు ఉన్నారు, ఎక్కడైనా చెకింగ్‌లు జరుగుతున్నాయా.. అనే విషయాలను గమనించి సమాచారం అందిస్తాయి. ఇప్పటివరకు వెనుకవైపు కారులో గంజాయిని తీసుకొస్తే ముందు నుంచి బైకులు ఎస్కార్ట్ ఇచ్చేవి. నరేంద్ర ఇందుకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. కారులో సరుకును తీసుకొస్తే పోలీసులకు దొరికిపోవడం ఖాయమని భావించాడు. ఇందుకోసం బైక్లపై తన అనుచరులతో గంజాయిని రప్పిస్తూ కార్లతో వారికి ఎస్కార్ట్ ఇచ్చేవాడు. ఇందుకోసం తన సొంత కార్లను ఉపయోగించడమే కాకుండా అద్దెకు కార్లు తీసుకునేవాడు.

గంపలగూడెంలో రైతుల ధాన్యం నగదుతో పరార్

గంపలగూడెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి లక్షలాది రూపాయలు విలువైన ధాన్యం కొనుగోలు చేసి వారికి నగదు చెల్లించకుండా మోసం చేసి ధాన్యం వ్యాపారి పరారైన ఘటనపై గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సత్యాలపాడు గ్రామానికి చెందిన దుద్దుకూరు వెంకటేశ్వర్లు గంపలగూడెంలోని ఒక రైస్ మిల్లును లీజుకు తీసుకొని దాన్ని నిర్వహిస్తూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాడు. ఈక్రమంలో వినగడపకు చెందిన అనుమోలు శేషగిరిరావు, గంపలగూడెంకు చెందిన చారుగుండ్ల చిన్న హనుమంతరావు, కేతేపల్లి మురళీకృష్ణ, చారుగుండ్ల చిత్తరంజన్‌తో కలిసి మొత్తం 11మంది రైతుల నుంచి రూ.39.67 లక్షల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి దాన్ని నగదుగా మార్చి రైతులకు ఇవ్వకుండా పరారయ్యాడు. రైతులు సత్యాలపాడులోని అతడి ఇంటి చుట్టూ ధాన్యం డబ్బుల కోసం ఎన్నిసార్లు తిరిగినా ఉపయోగం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి 20 రోజులుగా పరారీలో ఉన్నాడు. అనుమోలు శేషగిరిరావుతో పాటు మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

పెనమలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సిద్ధార్థ విశ్వవిద్యాలయం డీన్ వెంకట్రావు అన్నారు. స్థానిక సిద్ధార్థ విశ్వవిద్యాలయంలో శనివారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, జూనియర్లు, సీనియర్లు అన్న తేడా లేకుండా విద్యార్థులు అందరూ కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. ర్యాగింగుల పేరుతో తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాలువలా జాతీయ రహదారి!

- ప్రసాదంపాడు వద్ద రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- భారీగా స్తంభిస్తున్న ట్రాఫిక్
- పట్టించుకోని నగర కార్పొరేషన్ అధికారులు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు, ప్రజలు

(గుణదల - ఆంధ్రజ్యోతి)

చినుకు పడితే చాలు కాలువను తలపించేలా ప్రసాదంపాడు వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. విజయవాడ నగరపాలక సంస్థ కోట్ల రూపాయలు వెచ్చించి రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ను సుందరీకరణ చేశారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వర్షపునీరు నిల్వకుండా చూడాలన్న ఆలోచనతో ఫుట్‌పాత్‌కు అక్కడక్కడ నీరు డ్రెయిన్‌లోకి వెళ్లేలా పైపులు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ అధికారుల నిర్వహణ లోపం తోపాటు డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు మొత్తం రహదారిపై నిలిచిపోయి కాలువలా మారుతుంది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇప్పటికైనా విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు ఈ విషయమై దృష్టి సారించి వర్షపునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



ప్రసాదంపాడు వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

నీట్‌లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

డీజీఎం జాగర్లమూడి రవిశంకర్

పెనమలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్ ఫలితాల్లో విజయవాడ నారాయణ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి సత్తా చాటారని సంస్థ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ తెలిపారు. శనివారం నీట్ ఫలితాలను విడుదల చేశారు. ముస్కాన్ ఆనంద్ 643 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 112వ ర్యాంకు, అభినవ 631 మార్కులతో 231వ ర్యాంకు, ఎం హన్సిక రెడ్డి 625 మార్కులతో 343వ ర్యాంకు, అక్షయ్ కీర్తన్ 623 మార్కులతో 379వ ర్యాంకు, శ్రీరాం యాదవ్ 617 మార్కులతో 536వ ర్యాంకు, నికిత 615 మార్కులతో 605వ ర్యాంకు, యశశ్విని 614 మార్కులతో 646 వర్యాంకు, ఇషాంత్ 614 మార్కులతో 657వ ర్యాంకు, కే సైనారెడ్డి 609 మార్కులతో 866వ ర్యాంకు, వై కృష్ణ ప్రణీత్ 608 మార్కులతో 900వ ర్యాంకులతో విజయదుందుభి మ్రోగించారని రవిశంకర్ తెలిపారు. 5వేల లోపు 34 మంది, పదివేల లోపు 79 మంది, మొత్తం 170 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధి స్తారని తెలిపారు. ప్రతి యేడాది తమ మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం ఆనవాయితీగా వస్తోందని రవిశంకర్ తెలిపారు. విజేతలను డీన్స్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందనలతో ముంచెత్తారు.

గన్నవరంలో పాలిసెట్ కౌన్సెలింగ్

గన్నవరం జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం పాలీసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ వి.వి కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి మొదలుకానున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్‌కు ఇక్కడ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గతంలో విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ వెరిఫికేషన్ కార్యక్రమం జరిగేదని ఈ సంవత్సరం వాటితో పాటు గన్నవరం గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కూడా కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలిసిందిగా కోరారు.

భూసార పరీక్షల కనుగుణంగా సాగు చేయాలి

ఉంగుటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలకు అనుగుణంగా రైతులు తమ భూముల్లో పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు అన్నారు. భూసార పరీక్షల్లో భాగంగా ఇటీవల వీఏఏల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనా ప్యాకెట్లను మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో భద్రపరిచారు. మట్టినమూనా ప్యాకెట్లను గుడివాడ భూసార పరీక్షా కేంద్రానికి పంపించే ప్రక్రియలో భాగంగా శనివారం పరిశీలించిన ఏఈవో ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన 1475 మట్టి నమూనాల సేకరణ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. మట్టి నమూనాల్లో వచ్చిన ఫలితాలను త్వరలో రైతులకు తెలియజేస్తామన్నారు. భూసార పరీక్షల ద్వారా నేల లక్షణాలు, పోషక స్థాయిని తెలుసుకుని తదనుగుణంగా పంటలు ఎంచుకుని సాగు చేయాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచి, పచ్చిరొట్ట పైరులు పెంచి పొలంలో కలియదున్నడం ద్వారా భూమి సారవంతమవుతుందని పేర్కొన్నారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

కంకిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జనసేన పార్టీ నాయకులు మేదండ్రావు సతీష్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కంకిపాడులోని లక్ష్మీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేదండ్రావు సతీష్ మాట్లాడుతూ, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిదన్నారు. యువత రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎంతో మందికి ఆ రక్తం ఉపయోగపడుతుందని తెలియజేశారు. జనసైనికులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణ, జనసేన పార్టీ నాయకులు ముప్పా రాజా, దొప్పలపూడి రంజిత్, పచ్చిపాల శేఖర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జనసైనికులు మేదండ్రావు సతీష్

3,325 మందికి తల్లికి వందనం

ఉయ్యూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి 11 గ్రామాల్లో 3,325 మంది తల్లికి వందనం పథకానికి అర్హులని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. గ్రామాల వారిగా లబ్ధిపొందిన వారు ఆకునూరులో 288, బోళ్లపాడు 118, చిన ఓగిరాల 303, కడవకొల్లు 261, కలవపాముల 362, కాటూరు 640, గండిగుంట 565, ముదునూరు 490, పెద ఓగిరాలలో 298 మంది తల్లుల ఖాతాలో డబ్బులు జమవుతాయన్నారు.

హనుమాన్‌జంక్షన్ : తల్లికి వందనం పథకంలో బాపులపాడు మండలంలో 9,262 మంది తల్లులకు తమ బ్యాంకులో నగదు జమ అయినట్లు బాపులపాడు ఎంపీడీవో కార్యాలయం ఏవో త్రినాధరావు తెలిపారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.12.04 కోట్లు నగదు జమ అయినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సిక్స్ స్టెప్స్ వెరిఫికేషన్ 1,125 మంది అనర్హత పొందినట్లు తెలిపారు.

దుర్గా ఎస్టేట్‌లో చోరీ

ఉయ్యూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి దుర్గా ఎస్టేట్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం నుంచి రాగివైర్లు, కరెంటు సామాన్లు ఎత్తుకెళ్లారు. పట్టణ ఎస్సై వివరాల ప్రకారం.. దుర్గా ఎస్టేట్‌లో జంపాన కొండలరావుకు చెందిన నిర్మాణంలో ఉన్నభవనంలో శుక్రవారం రాత్రి దొంగలు ప్రవేశించి రాగివైర్లు, కరెంటు సామాను, ఇతర నిర్మాణ సామాగ్రి తీసుకుపోయారు. కొండలరావు చేసిన ఫిర్యాదు మేర శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జేఆర్‌డీ-2 విద్యుత్ ఫీడర్, న్యూ ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ ఈఈ పి. హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఆర్‌డీ పార్కు, పప్పు చాక నాగేశ్వరరావు రోడ్డు, నవతారోడ్డు, మురళీ నగర్ రోడ్డులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెనమలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గంగూరు ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వణుకూరు గ్రామానికి చెందిన గొర్లె వెంకట శివ ఆదినారాయణ (20) రాపిడో వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యథావిధిగా శనివారం ఉదయం రాపిడో వాహనంతో పనికి బయలు దేరాడు. బందరు రోడ్డుపై విజయవాడ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గొర్లె శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.



గండిగుంట రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

ఈకేవైసీకి ఆర్ఎస్‌కేలకు తరలివస్తున్న రైతులు

ఉయ్యూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరి కావడంతో రైతు సేవా కేంద్రాలకు రైతులు తరలివస్తున్నారు. ఈ నెల 21లోగా ఈకేవైసీ చేయించుకోవలని వ్యవసాయ సిబ్బంది చెప్పడంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి వేలిముద్రలు ఇస్తున్నారు. ఏమండలానికి చెందినవారైనా ఏదో ఒక రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో ఇతర మండలాలకు చెందిన రైతులు కూడా వస్తుండగా వారినుంచి సిబ్బంది వేలిముద్రలు సేకరిస్తున్నారు.

గన్నవరం : రైతులు అన్నదాత సుఖీభవ కోసం తప్పనిసరిగా రైతుసేవా కేంద్రం వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సునీల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే వేలిముద్ర వేయాల్సిందేనని తెలిపారు. రైతులు త్వరితగతిన రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి వేలిముద్ర వేయాలని పేర్కొన్నారు.



ఉయ్యూరు జడ్పీ విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న చైర్మన్ సత్యనారాయణ

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ఉయ్యూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అనేక పథకాలు అమలు చేస్తూ విద్యా భివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ ఆరేపల్లి శివసాయి ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రకిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనకు ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే గద్దె



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు కార్యాలయంలో శనివారం 2, 6, 9, 10, 13, 19 డివిజన్ల నాయకులతో డివిజన్ కమిటీపై ఆయన మాట్లాడారు. ప్రతి డివిజన్‌లో 10 మంది సభ్యులతో డివిజన్ కమిటీ నియమించాలని డివిజన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటుగా ముగ్గురు కార్యనిర్వహణ కార్యదర్శులు, ముగ్గురు కార్యదర్శులు, ఒక కోశాధికారి మొత్తం డివిజన్ కమిటీని నియమించాలన్నారు. కమిటీ బీసీ, ఎస్సీ, మైనార్టీ మహిళలకు ఒక్కొక్క రిజర్వేషన్ ఉండేలా చూడాలన్నారు. 14 మందితో డివిజన్ అనుబంధాల విభాగాల కమిటీలను నియమించుకోవాలన్నారు. తెలుగు యువత, ఐ.టీడీపీ, తెలుగు మహిళ, కల్చరల్, డాక్టర్స్ వింగ్, ఎస్.హెచ్.జీ గ్రూప్, ఎస్సీ విభాగం, మైనార్టీ, క్రిష్టియన్, బీసీ, ఎస్టీ, టీఎన్‌టీయూసీ, దివ్యాంగుల విభాగ కమిటీలను నియమించుకోవాలన్నారు. వరుసగా మూడు సార్లు డివిజన్ అధ్యక్ష పదవి చేసిన వారు స్వచ్ఛందంగా తప్పుకొని మరొకరికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి క్రాంతిశ్రీ, దాసరి గాబ్రియేల్ పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

పటమట నల్లూరి వారి కళ్యాణ మండపంలో స్పహర్షి చారిటబుల్ ట్రస్టు, యాకం ట్రస్టు, రోటరీ ట్రస్టు భాగస్వామ్యంతో సుబదం పేరుతో కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సంస్థను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభినందించారు. దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఇవ్వడంతోనే తన సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



ఎస్పీ గంగాధరరావుకు మొక్క అందజేస్తున్న ఎస్సై నాగరాజు

గుడివాడ ట్రాఫిక్ ఎస్సైగా నాగరాజు

గుడివాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పి.నాగరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఎస్పీ ఆర్.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. గుడివాడ పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై నాగరాజుకు ఎస్పీ గంగాధరరావు సూచించారు. గతంలో టూటౌన్ ఎస్సై నాగరాజు విధులు నిర్వహించారు.



తల్లికి వందనం పొందిన ముగ్గురు పిల్లలతో పరింకాయల లక్ష్మి



ఇద్దరు పిల్లలతో హర్షం వ్యక్తం చేస్తున్న తిరుపతమ్మ



గుడ్లవల్లేరులో ఆనందం వ్యక్తం చేస్తున్న మానికొండ రమేష్ కుటుంబం

పారదర్శకంగా తల్లికి వందనం

● అర్హులందరికీ నగదు జమ : ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీటవేస్తూ ప్రతి విద్యార్థికి లబ్ది చేకూర్చాలనే లక్ష్యంతో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం నిధులను విడు దల చేస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఉన్న తల్లికి వందనం నగదును జమ చేస్తుండటంతో తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పాఠశాల పునఃప్రారంభమైన రోజునే నగదును జమ చేసి ఇచ్చిన హామీ నెరవేర్చి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లులకు ఇచ్చిన హామిని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిలబెట్టుకున్నారని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. ఆంజనేయపేటలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు సాయన రాజేష్, షేక్ మీరాషరీఫ్, సుంకర వెంకట్, పి.రాజేష్, కిరణ్, భాను, సౌమ్య, కళ్యాణి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

తల్లులు అధైర్యపడొద్దు : వెనిగండ్ల

గుడివాడ/గుడివాడ రూరల్ : తల్లికి వందనం నిధులు రాని వారందరూ కంగారు పడాల్సిన అవసరం లేదని, సోమవారం నుంచి మనమిత్ర వాట్సప్ ఆయా గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి డేటాలో పొరపాట్లు ఏమైన ఉంటే తెలియజేయాలని, వాటిని సరిదిద్ది అర్హులను అధికారులు గుర్తిస్తారని తెలిపారు. కొందరు తల్లుల ఖాతాలు యాక్టివ్‌లో లేవని, దీంతో నిధులు వెనక్కివచ్చాయని, ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలన్నారు. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు జూలైలో తల్లికి వందనం పథకం అమలవుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. తల్లికి వందనం పథకం కింద నగదు పడని తల్లులు అధైర్యపడవద్దని ఎంపీడీవో విష్ణు ప్రసాద్ అన్నారు. ఖాతాల్లో నగదు జమ కానీ తల్లులు ఆయా సచివాలయాలకు వెళ్లి ఆధార్ చూపించాలని తెలిపారు. ఏయే పాఠశాలల్లో చదువుతున్నారో ఆయా సచివాలయాల్లో తెలిపితే ఆధార్ లింకు అయిందీ .లేనిది తెలియజేస్తామన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని ఆయన తెలిపారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బూరగడ్డ శ్రీకాంత్

ఒకే కుటుంబంలో ముగ్గురికి....

పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన పరింకాయల లక్ష్మీ, మండలంలోని వలివర్తిపాడుకు చెందిన కోటేశ్వరగంగ, డొక్కుమాల అనంత్‌కుమార్‌లకు ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం నగదు జమైంది. పట్టణానికి చెందిన సలీమున్నీసా, వసంతవాడ పేరయ్య, శ్రీనివాసరావు వంటి ఇద్దరు పిల్లలున్న ఎందరికో తల్లికి వందనం కింద అందరికీ నగదు జమైంది. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం నగదు జయవ్వడం పట్ల స్థానిక నాగవరప్పాడుకు చెందిన పరింకాయల లక్ష్మీ ఆనందం వ్యక్తం చేశారు. తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నగదును జమచేశారంటూ నైజాంపేటకు చెందిన సలీమున్నీసా అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.ఇది మంచి ప్రభుత్వమని కూటమి ప్రభుత్వం నిరూపించుకుందని, తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నగదు జమ చేసిందని బంటుమిల్లి రోడ్డుకు చెందిన శ్రీనివాసరావు కృతజ్ఞతుల తెలిపారు.

గుడ్లవల్లేరు మండలంలో...

గుడ్లవల్లేరు : మండలంలో తల్లికి వందనం కింద 4864 మంది పిల్లలకు నిధులు మంజూరై వారి తల్లుల ఖాతాలో జమపడుతున్నాయని ఎంపీడీవో టి.విజయసారథి తెలిపారు. అంగలూరు గ్రామ సచివాలయం పరిధిలో 373 మంది, చంద్రాల 136, డోకిపర్రు 1, 2 సచివాలయాల పరిధిలో 519 మందికి, గుడ్లవల్లేరు -1, 2 పరిధిలో 900 మందికి, కౌతవరం -1, 2 పరిధిలో 632 మందికి, కూరాడలో 284 మందికి, పెంజంద్ర 394 మందికి, పురిటిపాడు 129 మందికి, శేరిదగ్గుమిల్లి 258 మంది, శేరికల్వపూడి 220 మందికి, వడ్లమన్నాడు 365 మందికి, వేమవరం 252 మందికి, వెణుతురుమిల్లి 151 మందికి, విన్నకోట సచివాలయ పరిధిలో 260 మంది విద్యార్థులు అర్హత సాధించిన వారిలో ఉన్నారాన్నరు. తల్లికి వందన జమ పడడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు వడ్లమన్నాడులో పాలాభిషేకాలు చేశారు.

వైసీపీ దుష్ప్రచారం తగదు : వర్ల

పామర్రు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం వర్తింపజేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో అమలు జరుపుతుంటే చూసి తట్టుకోలేక మతి భ్రమించి వైసీపీ నేత జగన్మోహనరెడ్డి విషం కక్కుతూ ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన జగన్ బుద్ధి మార్చుకోకపోతే ప్రజలే సరైన రీతిలో జగన్ పార్టీకి బుద్ధిచెబుతారన్నారు.

తల్లికి వందనంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : వీరంకి

తోట్లవల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కన్న తల్లిని చూడలేని జగన్‌కు కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకంపై మాట్లాడే అర్హత లేదని గౌడ కార్పోరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం కింద రూ.13 వేలు చొప్పున జమచేస్తే సహించలేక జగన్ విమర్శలు చేయడాన్ని ఖండించారు.

మూడు దశాబ్దాలకు శిథిల లారీ తొలగింపు

తోట్లవల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు బస్టాండ్ సెంటర్లో సుమారు 31 సంవత్సరాల నుంచి ప్రజలకు అసౌకర్యంగా మారిన శిథిల లారీని పోలీసులు శనివారం తొలగించారు. ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు మద్య నిషేదం విధించిన సమయంలో లారీ పెనమకూరు కోళ్లమేత లోడుతో వస్తుండగా అక్రమంగా మద్యాన్ని తీసుకు వచ్చారు. ఆనాడు పోలీసులు లారీని సీజ్‌చేసి సెంటర్లో పెట్టారు. 30 సంవత్సరాలకు పైగా కావటంతో లారీ మొత్తం శిథిలమైపోయింది. ప్రజలకు ఇబ్బందిగా మారింది.

మే 22వ తేదీన విజయవాడ ఆర్టీసీ జోన్-2 ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్ విజయరత్నం, రీజనల్ మేనేజర్ వాణిశ్రీ, ఉయ్యూరు డిపో మేనేజర్ పెద్దిరాజు తోట్లవల్లూరు వచ్చి బస్‌స్టేషన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న లారీని తొలగించాలని, లేకుంటే తామే వేలం వేస్తామని ఎస్సై సీహెచ్ అవినాష్‌కు వినతి పత్రం అందించారు. దాంతో శనివారం ఎక్సకవేటర్‌తో లారీని తొలగించి తహసీల్దార్ కార్యాలయ అవరణలోకి మార్చారు.



రక్తదానం చేసిన ఫార్మసీ కళాశాల విద్యార్థులు

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

గుడ్లవల్లేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి విద్యార్థులు ప్రాణదాతలు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. గుడ్లవల్లేరు వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇండియన్ ఫార్మా స్యూటిక్ అసోసియేషన్ సంయుక్తంగా రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చంద్రశేఖర్ పాల్గొని రక్తదానం చేసిన ఫార్మసీ విద్యార్థులను, ఫ్యాకల్టీని అభినందించారు. అధిక యూనిట్ల రక్తదానం చేసిన కళాశాల విద్యార్థుల తరఫున కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, రెడ్‌క్రాస్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకొన్న ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావును, రక్తదానం చేసే విధంగా దాతలకు ప్రేరణ కల్పించిన స్టార్ విద్యా సంస్థల డైరెక్టర్ అయ్యప్పస్వామిని, 83 సార్లు రక్తదానం చేసిన మాచర్ల రామకృష్ణను రెడ్‌క్రాస్ తరఫున ఘనంగా సన్మానించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, ట్రెజరర్ రాంబాలాజీ, నాగుల్ మీరావలి, కళాశాల సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

11వ సారి రక్తదానం



గుడివాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో న్యాయవాది అల్లూరి హేమంత్‌కుమార్ 11వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే రక్తదాతలు పెరిగారని, రానున్న రోజుల్లో ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, రక్తదాతలుగా మార్చాలని న్యాయవాది హేమంత్ అన్నారు.



ఐఐటీ ర్యాంకర్ భరత్‌చంద్రను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ మంజుల

ఐఐటీ ఆలిండియా ర్యాంకర్ భరత్‌చంద్రకు ఘన సన్మానం

గుడివాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ జేఈఈ - 2025లో ఓబీసీ విభాగంలో ఆలిండియా రెండో ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 21వ ర్యాంకు సాధించిన విశ్వభారతి పూర్వ విద్యార్థి పల్లా భరత్ చంద్రను ఘనంగా సత్కరించారు. రాజేంద్రనగర్‌లోని పాఠశాల ఆవరణలో శనివారం పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీ మన్నారాయణ, డైరెక్టర్ ఆర్.మంజుల సత్కరించి అభినందించారు. లాప్‌టాప్‌ను బహుకరించారు. పొట్లూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఐఐటీలో అద్భుత ర్యాంకులను తమ పూర్వవిద్యార్థులు సాధించారన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు ఆశీస్సులతో ఐఐటీ ఫౌండేషన్ ప్రారంభించామని, ఉపాధ్యాయుల కృషితో అద్భుతమైన విజయాలను అందుకున్నామన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజయ డెయిరీ విశ్రాంత ఉద్యోగి తాతినేని సూర్యనారాయణ మృతి



సూర్యనారాయణ (ఫైల్)

పమిడిముక్కల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురంకు చెందిన తాతినేని సూర్యనారాయణ(దత్తుడు) (72) శనివారం మృతి చెందారు. విజయ పాల శీతలీకరణ కేంద్రంలో ఉద్యోగం చేసి రిటైరైన తరువాత టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవలందిస్తున్నారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఆదివారం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనునట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సూర్యనారాయణ మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.



గుడ్లవల్లేరులో డ్రెయిన్ల పూడికతీత

గుడ్లవల్లేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు అంతర్గత రహదారులు నీటమునిగిన నేపథ్యంలో శనివారం ఉదయం గ్రామ పంచాయతీ యుద్ధప్రాతిపదికన డ్రెయిన్‌ల పూడికతీత పనులు నిర్వహించారు. రోడ్లు నీటమునిగి ప్రజలకు అసౌకర్యం ఏర్పడిందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి శనివారం పనులను నిర్వహించారు. డ్రైనేజీలు పూడిపోవడమే ముంపునకు ప్రధాన కారణం కావడంతో వార్ఫు రోడ్డు నుంచి ప్రధాన కూడలి, సంతబజార్‌లలో డ్రెయిన్లపై ఆక్రమణలను పగుల కొట్టి పూడిక తొలగించారు. మరో రెండు రోజులపాటు డ్రెయిన్ ఆక్రమణలను తొలగించి పూడికతీత పనులు కొనసాగిస్తామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు చెప్పారు.



వైభవంగా శివకల్యాణం

గుడ్లవల్లేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గంగాపార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం రాత్రి శివకల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. అనీష్, సాయిరేష్మ దంపతులు కల్యాణ ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు కొసరాజు వెంకటాద్రి (పెద్దబాబు), అడుసుమిల్లి వీరబద్రరావు, అన్నే ప్రసాదరావు, అడుసుమిల్లి కృష్ణమోహన్, దేవిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యోగాతో మంచి ఆరోగ్యం

పామర్రు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని యోగా గురువు కాకర్ల గణేష్ అన్నారు. రాపర్ల ఎంపీపీ పాఠశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అలవరుచుకోవాలన్నారు. తొలుత ఆసనాలు వేసి ప్రజలను చైతన్య వంతుల్ని చేశారు. పామర్రు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, శ్రీకాంత్, కాకర్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, ముగ్గురు పిల్లలు కన్పించడం లేదని ఫిర్యాదు

గుడ్లవల్లేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : భార్య, ముగ్గురు ఆడపిల్లలు కనపడడం లేదంటూ డోకిపర్రు పంచాయతీ పొనగంటిగూడెం గ్రామానికి చెందిన దేవరపల్లి రాజు శనివారం గుడ్లవల్లేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, తాను ఐదురోజులు డ్యూటీకి వెళ్లి ఈనెల తొమ్మిదో తేదీన ఇంటికి వచ్చేసరికి భార్యపిల్లలు ఇంట్లో కన్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చుట్టుపక్కల వారిని వాకబు చేయగా ఎనిమిదో తేదీ ఉదయమే పిల్లలను వెంటబెట్టుకొని భార్య జయలక్ష్మి (35), పిల్లలు ప్రవీణ (9), శ్రీవిద్య(7), వందన(6)తో వెళ్లినట్లు చెప్పారన్నారు. ఆరోజు నుంచీ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. రాజు ఫిర్యాదు మేరకు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మొవ్వ సీడీపీవోగా ప్రసన్న విశ్వనాథ్



కూచిపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎస్.ప్రసన్న విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లి సీడీపీవోగా విచ్చేసిన ఆమెను సెక్టార్ సూపర్‌వైజర్లు ఏనుగు పుణ్యవతి, ఏఎస్.కల్యాణి, వి.రత్నమాల, టి.రమానాగమణి, జె.విశ్రాంతమ్మ, పి.రాజరాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ బి.మధుబాబు, డీఈవో ఎం.రవిశంకర్ అభినందించారు.



వైభవంగా లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా శనివారం లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. 116 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు రైతులు ఈకేవైసీ చేయించాలి

గుడివాడ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి తప్పనిసరిగా వేలి ముద్ర వేయాలని మండలి వ్యవసాయ అధికారిణి బోలెం అనంత లక్ష్మీ తెలిపారు. ప్రతి రైతు వేలిముద్ర వేస్తేనే నగదు జమ అవుతుందని తెలిపారు. గుడివాడ మండలంలో 3661 మంది రైతులు ఉండగా, 412 మంది రైతులు మాత్రమే వేలిముద్రలు వేశారని తెలిపారు. మిగిలిన రైతులు ఈ నెల 20వ తేదీ లోపల వేలిముద్రలు వేయాలని తెలిపారు. గుడివాడలో కాకుండా వేరే ప్రాంతాల్లో ఉన్న రైతులు ఆయా ప్రాంతాల్లో వేలిముద్రలు వేయవచ్చునని, ఆధార్ లింక్ అయ్యి ఉండాలని తెలిపారు. ప్రతి రైతుకు ఆధార్, అండగల్ లింక్ అయితేనే వేలి ముద్ర పడుతుందని తెలిపారు. రైతులు వెంటనే స్పందించి వేలిముద్ర వేయటానికి ప్రయత్నించాలని ఆమె కోరారు.పామర్రు : ఈకేవైసీ చేయించుకున్న రైతన్నలకు మాత్రమే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ నగదు జమ అవుతుందని మండల వ్యవసాయాదికారి శివనాగరాణి తక్షణమే ఈకేవైసీ కోసం రైతులు తమ ఆధార్ కార్డులతో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి తప్పనిసరిగా వేలుముద్రలతో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏవో నాగేశ్వరరావు బదిలీ

తోట్లవల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు శనివారం బదిలీ అయ్యారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామకు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. పామర్రు టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న జి.శ్రీదేవి తోట్లవల్లూరు ఏవోగా వచ్చినట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఏపీఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌కు చల్లపల్లి నేతల అభినందనలు



చల్లపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎన్జీజీవో) రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఎ.విద్యాసాగర్‌ను చల్లపల్లి ఎన్జీజీవో యూనిట్ నేతలు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. చల్లపల్లి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు తోట సుధాకరరావు, పి.వి.మాధవేంద్రరావు తదితరులు విద్యాసాగర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, యోగా మాస్టర్ స్వర్ణలతను సత్కరిస్తున్న ఈవో

యోగాంధ్రలో ప్రజలందరూ పాల్గొనాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు నిచ్చారు. గాంధీ నగర్‌లోని ఉదయపు నడక మిత్రమండలి ప్రాంగణంలో శనివారం జరిగిన యోగా శిక్షణ కార్యక్రమాల్లో శనివారం కలెక్టర్ పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు యోగా ఎంతో అవసరమన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19న మోపిదేవిలో యోగా ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం

యోగసాధనతో ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని బచ్చుపేట వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బచ్చుపేట ఆంజనేయస్వామి దేవాలయ ప్రాగణం లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా మాస్టర్ జి.స్వర్ణలత గంట సేపు ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగా మాస్టర్ స్వర్ణలతను ఈవో సమ్మెట ఆంజనేయ స్వామి, కె.ఎల్.ఎన్ ఆచార్యులు, చిట్టికుమారి సత్కరించారు. మునిసిపల్ అసిస్టెంట్ కమీషనరు ఎవి గోపాలరావు, లోగిశెట్టి వెంకటస్వామి, ముక్తేవి రవికాంత్ పాల్గొన్నారు.

నాగాయలంకలో జలాసనాలు 18న

నాగాయలంక : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం 3.30 గంటలకు నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లోని కృష్ణానదిలో ఆయుష్ విభాగం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జల యోగాసనాలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వ్యక్తులు మత్స్యశాఖ అధికారి ఆర్.ప్రతిభ 8639226587, ఎఫ్‌డీవో సునీత 8978507836, టి.రఘుశేఖర్ 9490636466 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



జరుగువానిపాలెంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న తల్లులు, హరిపురం గ్రామంలో కేక్ కట్ చేస్తున్న తల్లులు,



మంత్రి కొల్లు రవీంద్రను అభినందిస్తున్న కట్టా అంజిబాబు

తల్లికి వందనం అమోఘం



అవనిగడ్డ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం ఓ విప్లవాత్మక పథకమని పేదరికం కారణంగా చిన్నారులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నుంచి తల్లికి వందనం కార్యక్రమం విముక్తి కలిగిస్తుందని టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బడికి వెళ్లాలన్న తలంపుతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చదువుకునే పిలలందరికీ తల్లికి వందనం అందించారన్నారు. మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, కిట్లు పంపిణీ చేశారని, ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తి కావొచ్చిందని, 9600 ప్రైమరీ పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నారని గోవర్ధన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తుంటే వైసీపీ చౌకబారు రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

కోడూరు : విద్య కోసం, విద్యాభివృద్ధి కోసం కూటమి సర్కార్ అహర్నిశలు శ్రమిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన సందర్భంగా శనివారం హరిపురం, జరుగువానిపాలెం గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు చిన్నారులు, తల్లిదండ్రులు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పూతబోయిన శ్రీనివాసరావు, బోలిశెట్టి విఠల్ రావు, బొలిశెట్టి వెంకటేష్, తాతా పోతురాజు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, అప్పికట్ల రవీంద్ర, గోగినేని సోమశేఖరరావు, యలవర్తి వెంకటేశ్వరరావు, పాశం పాండురంగారావు, పెద్ద ఎత్తున చిన్నారులకు తల్లిదండ్రులు చిన్నారులు పాల్గొన్నారు. **నాగాయలంక :** సూపర్ సిక్స్‌లో కీలకమైన తల్లికి వందనం పథకం అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చరిత్ర సృష్టించారని మండల తెలుగు యువత అధ్యక్షుడు మేడికొండ విజయ్ అన్నారు. చదువుతున్న ప్రతి విద్యార్థికి డబ్బులు పడటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

మంత్రి రవీంద్రకు సత్కారం

మచిలీపట్నం టౌన్ : తల్లికి వందనం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ నాయకులు, తల్లిదండ్రులు అభినందించారు. నలుగురు పిల్లలకు కూడా నిధులు జమ చేయడంతో తల్లులు ఆనందంతో ఉన్నారన్నారు. మంత్రి కొల్లు రవీంద్రను మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్ కుమార్, టౌన్ హాలు మాజీ అధ్యక్షుడు చిన్నం శివ, 39వ డివిజన్‌కు చెందిన టీడీపీ ఇన్‌చార్జి కట్టా అంజిబాబు తదితరులు అభినందించారు.



కరగ్రహారంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ

బెల్టుషాపుల కట్టడికి చర్యలు

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బెల్టు షాపుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ తెలిపారు. పెదకరగ్రహారం గ్రామంలో కేర్ కమిటీ ఆధ్వర్యంలో సారా నిర్మూలనపై, బెల్టుషాపుల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. అక్రమంగా మద్యం అమ్మినా, సారా తయారు చేసిన 14405కు ఫోన్ చేయవచ్చన్నారు. స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.ప్రేమ్‌చంద్, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సుమప్రియ, సామాజిక సేవకులు ఎన్. ధర్మతేజ, పరుచూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బోలెం అయోధ్యరామయ్య, టీడీపీ నాయకులు బొర్రా రాము, బత్తిన నాగరాజు తదితరులు మాట్లాడారు.



పెడనలో పాడిరైతులతో మాట్లాడుతున్న మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాల సంఘాలు నానో మిషన్లు వాడాలి

పెడన, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పాల సంఘాలు నానో మిషన్లు ఉపయోగించాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని పాల సంఘంలో శనివారం పాల సంఘాల అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నానో మిషన్లు వినియోగించడం వల్ల పాలల్లో నీటి శాతం, ఫ్యాట్ శాతం కచ్చితంగా తెలుస్తాయన్నారు. పాడి రైతులకు గడ్డి విత్తనాలు, గడ్డి కణుపులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. మినరల్ మిక్చర్ వాడటం వల్ల గేదెలు సకాలంలో ఎదకు వస్తాయని, చూడి నిలబడుతుందని ఆంజనేయులు తెలిపారు. పట్టణ పాల సంఘం అధ్యక్షుడు హన్ను ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకటనగేష్, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, మడక, బల్లిపర్రు, నడుపూరు, ఆర్‌వి పల్లి, చిట్టిపాలెం, కట్లపల్లి, ఆకులమన్నాడు పాల సంఘాల అధ్యక్షుల పాల్గొన్నారు.

బీదర్‌ఎక్స్‌ప్రెస్‌కు బోగీల సంఖ్య పెంచాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే బీదర్ ఎక్స్‌ప్రెస్‌కు బోగీల సంఖ్య పెంచాలని సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం తదితరులు శనివారం రైల్వేస్టేషన్ మాస్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నగర కార్యదర్శి బి. సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడారు. బీదర్ ఎక్స్‌ప్రెస్‌కు గతంలో నాలుగు జనరల్ బోగీలు ఉండేవని, ఆ నాలుగులో రెండు తగ్గించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. హైదరాబాద్‌కు పెరుగు తున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న నాలుగు బోగీలను పునరుద్ధరించాలన్నారు. సికింద్రాబాద్‌కు మరో రైలు నడపాలని సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ డిమాండ్ చేశారు. సిహెచ్ జయరావు, టి.చంద్రపాల్, న్యాయవాది రావి వెంకట్రావు, డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తికాకుండానే కుంగిన రహదారి



(ఆంధ్రజ్యోతి-కోడూరు): కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ దశలోనే పలు చోట్ల కుంగిపోతోంది. కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి అధ్వాన్నస్థితికి చేరుకోవటంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యా రు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం చేపట్టగా, పూర్తి కాకముందే జయపురం - కొత్తపాలెం, కృష్ణాపురం - జయపురం గ్రామాల మధ్య ఆరు చోట్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంట కాలువలోకి కుంగిపోయింది.. రహదారి నిర్మాణం పూర్తి కాకముందే పలు చోట్ల రోడ్డు కుంగిపోవటంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

తొలి ఏడాదే రూ.822 కోట్లతో అభివృద్ధి పనులు

● సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే మండలి కృతజ్ఞతలు

అవనిగడ్డ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో తొలి ఏడాదే రూ.822 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. అవనిగడ్డలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జలవనరుల శాఖ ద్వారా రూ.1219 కోట్లు, వ్యవసాయ శాఖ ద్వారా రూ.204.35 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.53.32 కోట్లు, ఆర్ అండ్ బి ద్వారా రూ.28.28 కోట్లు, శిశు సంక్షేమశాఖ ద్వారా రూ.1.49 కోట్లు, హౌసింగ్ శాఖ ద్వారా రూ.2.01 కోట్లు, విద్యుత్ శాఖ ద్వారా రూ.4.73 కోట్లు, ఉద్యాన వన శాఖ ద్వారా రూ.1.18 కోట్లు, మత్స్యశాఖ ద్వారా రూ.4.13 కోట్లు, ఆర్ డబ్ల్యుఎస్ ద్వారా రూ.4.17 కోట్లు అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశామన్నారు. మొత్తం రూ.601.24 కోట్లతో అభివృద్ధి పనులు చేపడితే, 211.6 కోట్లతో వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. గడిచిన ఐదేళ్లలో మూలన పడిన క్షిపణి పరీక్షా కేంద్రం పనులు మళ్లీ పునఃప్రారంభం కావటం కూటమి ప్రభుత్వం సాధించిన గొప్ప విజయమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో రాబోయే పదేళ్లలో 20 వేల కోట్లకు పైగా అభివృద్ధి జరుగతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కీలకమైన అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణానికి నిధుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. నాగాయలంకలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ సిద్ధం చేస్తున్నామన్నారు. కోడూరు - అవనిగడ్డ రహదారిని పూర్తి చేశామని, పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తనకు అపూర్వ విజయం అందించిన నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా కృషి చేస్తానని, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.





గుండేర్ లిఫ్ట్ నుంచి వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రైతులు, కూటమి నేతలు

గుండేరు లిఫ్ట్ ద్వారా సాగునీటి సరఫరా ప్రారంభం

ఘంటసాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గుండేరు లిఫ్ట్ ద్వారా సాగునీటి సరఫరాను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఘంటసాల మండలం దాలిపర్రు రోడ్డులోని గుండేరు మేజర్ డ్రైనేజీ వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా నాలుగు మోటార్లతో లంకపల్లి బ్రాంచ్ కాలువలోకి సాగునీరు ఎత్తిపోతల కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమనది చానల్ నుంచి లంకపల్లి బ్రాంచ్ కాలువ ద్వారా ప్రవహిస్తున్న సాగునీటిలో పూలు జల్లి పూజలు చేశారు. భీమనది చానల్ చివరి ఆయకట్టులో ఉన్న చల్లపల్లి, ఘంటసాల మండలాల పరిధిలోని ఉన్న దాలిపర్రు, యండకుదురు, పూషడం, మాజేరు, లంకపల్లి గ్రామాల్లో 3500 ఎకరాలకు దాలిపర్రు వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీ పక్కన ఏర్పాటు చేసిన రెండు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా యండకుదురు, లంకపల్లి బ్రాంచ్ కాలువల్లోకి గుండేరు నీటిని ఎత్తిపోసి సాగునీటిని అందిస్తున్నారు. ఐనంపూడి డ్రైనేజీ గుండేరు మేజర్ డ్రైనేజీలో కలిసే ప్రాంతంలో సముద్రపు ఉప్పునీరును అడ్డుకునేందుకు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, కోసూరు డీసీ వైస్ చైర్మన్ పరిశె చలపతిరావు, పూషడం సర్పంచ్ అంకం మారుతీరావు, టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావు, నాయకులు వీరమాచినేని భవాని ప్రసాద్, మిక్కిలినేని మధు, కొమ్మారెడ్డి లీలాకృష్ణ, బండి పరాత్పరరావు, బోనం బాలరాజు, దోసేపూడి బుజ్జి, తుమ్మలగుంట గోపాలకృష్ణ, ఇరిగేషన్ శాఖ మచిలీపట్నం సబ్ డివిజన్ డీఈఈ వింజరపు అపర్ణ, ఏఈఈ టి.వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



శ్రీరామచంద్రుని మార్గంలో నడవాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామచంద్రుని మార్గంలో నడవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అన్నదానం చిదంబరశాస్త్రి పేర్కొన్నారు. వనమలమ్మ దేవాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో చిదంబరశాస్త్రి మాట్లాడారు. రాముడు మానవ రూపంలో జన్మించి మానవాళిని చైతన్యపరిచారన్నారు. శ్రీరాముని ఏకపత్నీవ్రతం, సోదర ప్రేమ అందరికీ ఆదర్శమన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

చల్లపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీగరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి 23వ వార్షిక కల్యాణోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు ఆధ్వర్యంలో పండితులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

మాజీ సీఎం జగన్ మహిళలకు క్షమాపణ చెప్పాలి

● బూరగడ్డ వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుల విమర్శలు బురదచల్లే విధంగా ఉన్నాయని మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతి రాజధానిని దేశంలోనే ఒక మోడల్ రాజధానిగా సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారన్నారు. అమరావతి మహిళలపై, అమరావతి రాజధానిపై జగన్ మీడియా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. మహిళలు ఆదిపరాశక్తులని, మహిళలను కించపరిచే విధంగా మాజీ సీఎం జగన్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి వెంటనే తన విమర్శలను ఉపసంహరించుకుని మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు.

జగన్ పాలనలో అన్నీ అరాచకాలే : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీయం జగన్ పాలనలో అన్నీ అరాచకాలే అని, సంక్షేమంపై దృష్టి సారించలేదని సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి పాలనలో తల్లులకు ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున జమ అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకిచ్చిన వాగ్దానాలు వరుసగా నెరవేరుస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఐ. దిలీప్‌కుమార్, పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీ పిల్లలకు దుస్తుల పంపిణీ

మచిలీపట్నం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఆధ్వర్యంలో దేశాయిపేట ఎస్టీ కాలనీలో శనివారం పిల్లలకు దుస్తులు, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేతలు మోదుమూడి రామారావు, దేవభక్తుని నిర్మల, నాయకులు వడుగు చైతన్యకుమార్, యర్రంశెట్టి ఈశ్వరరావు, బొమ్మిడి వెంకటేశ్వరవర్మ, నాగిడి భాస్కర్ పాల్గొన్నారు.

గూడూరు మండల సమావేశం రేపు

గూడూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.వనజ తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

మోపిదేవి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 సంవత్సరానికి సామాజిక తనిఖీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. వెంకటాపురంలో చేసిన 86 పనులను డీఆర్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కూలీలను విచారించారు. పనుల ప్రదేశాలకు వెళ్లి కొలతలు వేశారు. మండలంలో 13 గ్రామపంచాయతీల్లో 935 పనులను బృందాలు తనిఖీ చేయనున్నట్లు ఎస్‌ఆర్పీ సూర్యచక్ర తెలిపారు.

కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలి

పెడన రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం కారణంగా గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో అరుణకుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నీటి నిల్వల వలన గ్రామాల్లో అంటురోగాలు ప్రబలుతాయన్నారు. ప్రజలు నిరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.